క్లుప్తంగా

గురువుకు పూర్వ విద్యార్థుల ఘన సత్కారం



అన్నదేవరపేటలో గురువు బలరామయ్యను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

తాళ్లపూడి: గురువు అంటే సైన్స్ ఉపాధ్యాయుడు సుంకవల్లి బలరామయ్యలా ఉండాలని, అందుకే తామంతా నేడు ఉన్నతస్థాయిలో ప్రయోజకులుగా ఉన్నామని అన్నదేవరపేట అల్లూరి సూరన్న జిల్లా పరిషత్ హైస్కూల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు అన్నారు. బలరామయ్య దగ్గర సుమారు 50 ఏళ్ల క్రితం విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు అన్నదేవరపేట జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఆదివారం ఆయనను ఘన సత్కరించారు. 1971 నుంచి 1986 వరకు సుంకవల్లి సైన్సు ఉపాధ్యాయుడిగా పనిచేసిన సమయంలో ఆయన వద్ద 10వ తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులంతా కలిసి ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముందుగా గుర్రపు బండిపై వేదిక వద్దకు ఆయనను సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ బలరామయ్య సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆయనను పూల బొకేలు, శాలువాలతో, గజమాలతో ముంచెత్తారు. సుంకవల్లి వద్ద విద్యనభ్యసించిన వారు జడ్జిలుగా, ఇంజినీర్లుగా, ఉపాధ్యాయులుగా, కాంట్రాక్టర్లుగా ఉన్నత స్థాయిలో ఉన్నారని తెలిపారు. పూర్వ విద్యార్థులు నెక్కిళ్ల ప్రసాద్, గోరిజాల సూరిబాబు, కేసిరాజు రవి, దుగ్గిరాల సూర్యప్రకాష్, మద్దుకూరి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఉమా చోడేశ్వరస్వామికి రుద్రాభిషేకం

కొవ్వూరు: పట్టణంలో పాతూరు ఉమా చోడేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, బిల్వార్చన చేశారు. స్వామి వారికి రుద్రహోమం, అమ్మవార్లకు శ్రీ సూక్త విధానంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఉండ్రాజవరానికి చెందిన ఏలూరి పాటి సత్యకృష్ణ, సుబ్బలక్ష్మి దంపతులు చేతుల మీదుగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు దేవరకొండ సాయి ప్రసాద్, కొతవరపు భానులతో పాటు పండితులు పాల్గొన్నారు.

2న మాదిగ ఆత్మీయ సమ్మేళనం

కొవ్వూరు: నవంబర్ 2న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ రాజమహేంద్రవరం పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. పట్టణంలో కేజీఎం పాఠశాలలో ఆదివారం సాయంత్రం ఎమ్మార్పీఎస్ ముఖ్యనాయకులు సమావేశమయ్యారు. మాదిగల ఆత్మీయ సమ్మేళనం సభ ఏర్పాట్లపై చర్చించారు. పెనుమాక జయరాజు, కొడమంచిలి సత్యనారాయణ, అయినపర్తి రాజేంద్రప్రసాద్, వరిగేటి కాంతరాజు, వేమగిరి వెంకట్రావు పాల్గొన్నారు.

ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోవద్దు



కోరుమామిడిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు రూరల్: రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి నిర్దేశించిన మద్దతు ధర పొందాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మండలంలోని కోరుమామిడిలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి దుర్గేష్ ఆదివారం ప్రారంభించారు. ఆర్డీఓ రాణీ సుస్మిత, తహసీల్దార్ బి.నాగరాజునాయక్, సివిల్ సప్లై డీటీ ఎం.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మోటారు సైకిల్ చోరీపై కేసు నమోదు

కొవ్వూరు: పట్టణంలో మెరకవీధిలో వినాయకుడి గుడి వీధికి చెందిన జాన దుర్గాభాస్కరరావు తన ఇంటి ముందు పార్కింగ్ చేసుకున్న మోటారు సైకిల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారని పట్టణ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. జూలై 10వ తేదీ రాత్రి రోజూ మాదిరిగానే ఇంటి ముందు పార్కింగ్ చేసి ఉదయం చేసే సరికి మోటారు సైకిల్ కనిపించలేదని దుర్గాభాస్కరరావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తెలిపారు.

నేడు నిడదవోలు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం


నిడదవోలు : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి తెలిపారు. ఈ సమావేశానికి సభ్యులు హజరుకావాలని ఆమె కోరారు.

ఆస్పత్రిలో అరకొర సౌకర్యాలు

- అధ్వానంగా పరిసరాలు
- పేరుకే మదర్ పీహెచ్‌సీ..అభివృద్ధిని పట్టించుకోని అధికారులు
- శిథిలావస్థకు చేరిన సిబ్బంది వసతి భవనాలు
- తొలగించాలని కోరుతున్న వైద్య సిబ్బంది



కానూరు పీహెచ్‌సీ భవనం



కానూరు పీహెచ్‌సీలో శిథిలమైన క్వార్టర్స్

పెరవలి: ఆసుపత్రికి వస్తే వ్యాధిగ్రస్తులకు సగం రోగం తగ్గిపోయిన భావన కలుగుంది. కానీ కానూరు పీహెచ్‌సీకి వచ్చే రోగులు భయపడే పరిస్థితులు అక్కడ నెలకొన్నాయి. పేరుకి మదర్ పీహెచ్‌సీ కానీ సౌకర్యాలు చూస్తే అంతంత మాత్రమే, నిత్యం వందలాది మంది రోగులు వస్తున్నారంటే అందుకు ఇక్కడ వైద్యులు అందిస్తున్న వైద్యం వల్లనే కానీ ఈ ఆసుపత్రిని చూసి ఎంత మాత్రం కాదు. కానూరు పీహెచ్‌సీ ఆవరణ అంతా చెత్తా చెదారంతో నిండి ఉంటే, వైద్య సిబ్బందికి కేటాయించిన వసతి భవనాలు శిథిలమవడంతో అక్కడి పరిసరాలు చిట్టడవిలా మారింది. ఈ ఆసుపత్రి అభివృద్ధిపై అధికారులు, ప్రజాప్రతినిధులు ఎంత నిర్లక్ష్యం వహిస్తున్నారో ఇక్కడి పరిసరాలను చూస్తేనే అర్థమవుతుంది. పెరవలి మండలం కానూరులో మదర్ పీహెచ్‌సీ ఉంది. ఆసుపత్రి ఆవరణ అంతా చెట్లు, పొదలతో నిండిపోవటంతో పాటు ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెతాదరం పేరుకుపోయింది. పైగా వర్షాల వల్ల ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోవటంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీనితో వైద్యం కోసం వచ్చిన రోగులు ముక్కుమూసుకుని ఆసుపత్రికి రావలిసి వస్తోంది. చీకటి పడిందంటే ఆసుపత్రి వద్ద విష సర్పాల సంచరించడంతో సిబ్బందితోపాటు రోగులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు.

రోజుకి 150 మందికి పైగా రోగులకు వైద్య సేవలు

ఈ ఆసుపత్రిలో వైద్యం పొందేందుకు నిత్యం150 మందికి పైగా రోగులు వస్తుంటారు. ఇక్కడి డాక్టర్లు, సిబ్బంది నాణ్యమైన సేవలు అందించడంతో అధిక సంఖ్యలో రోగులు వస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయం ప్రకారం ప్రతి నెల ఆసుపత్రి పరిధిలోని గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ఇక్కడి వైద్యులు రోగులకు సేవలు అందిస్తున్నారు.

క్వార్టర్స్ పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు

ఈ ఆసుపత్రిలో క్వార్టర్స్ శిథిలమై 15 ఏళ్లు అయినా నేటికీ వాటికి విముక్తి కలగలేదు. అభివృద్ధి విషయంలో ఈ ఆసుపత్రి నిర్లక్ష్యానికి గురవుతోందనే విమర్శలున్నాయి. 60 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ఆసుపత్రి శిథిలావస్థకు చేరటంతో అభివృద్ధి చేయాలని ప్రజాప్రతినిధులను ప్రజలు, వైద్య సిబ్బంది వేడుకుంటూనే ఉన్నారు. శిథిలమైన క్వార్టర్స్‌ను తొలగించాలని గతేడాది వైద్యులు ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా నేటికీ స్పందన లేదు. వైద్యులు, వైద్య సిబ్బందికి స్థానికంగా వసతి భవనాలు ఉంటే ఈ ఆస్పత్రిలో 24 గంటలూ రోగులకు వైద్య సేవలు అందేవని పలువురు అన్నారు. శిథిలమైన క్వార్టర్స్‌లో ఎటువంటి సౌకర్యాలు లేక వైద్యులు దూరప్రాంతం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు.

వైఎస్సార్ చొరవతో ఆసుపత్రి భవన నిర్మాణం

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పల్లెబాటకు వచ్చిన సందర్భంలో శిథిలమైన ఆసుపత్రి భవనాలను చూసి ఆధునీకరణకు అప్పటికప్పుడు రూ.40లక్షల నిధులు మంజూరు చేశారు. ఏడాది కాలంలోనే ఆస్పత్రి ఆవరణలో అత్యాధునిక భవనం నిర్మితమైంది. మరుసటి ఏడాది పల్లెబాటకు వచ్చినప్పుడు స్వయంగా రాజశేఖరరెడ్డి ఈ భవనానికి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఈ ఆస్పత్రిని పట్టించుకున్న వారు కరువయ్యారు.



అపరిశుభ్రంగా పీహెచ్‌సీ ఆవరణ

గతమెంతో ఘనం

పేరుకే మదర్ ఆసుపత్రిగా ఉన్నా ఎటువంటి సౌకర్యాలు లేక సిబ్బంది, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ కూర్చోవాలో తెలియక ఆవరణలో ఉన్న చెట్ల నీడనే కాలక్షేపం చేస్తున్నారు. గతంలో తణుకు తాలూకాలో ఇదే పెద్ద ఆసుపత్రిగా ఉండేది. ఇక్కడికి తణుకు, నిడదవోలు నుంచి వైద్య సిబ్బంది శిక్షణకు వచ్చేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. శిథిలమైన భవనలు, అడివిని తలపించేలా ఉన్న పరిసరాలు, అపరిశుభ్ర వాతావరణం ఇదీ నేడు కానూరులోని మదర్ పీహెచ్‌సీ దుస్థితి.

శిథిలమైన భవనాలపై ఉన్నతాధికారులకు నివేదిక



శిథిలమైన క్వార్టర్స్ భవనాలను తొలగించాలని ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా నివేదిక సమర్పించాం. ఆస్పత్రి పరిసరాల్లో పెరిగిన చెట్లను, తుప్పలను వారం రోజుల క్రితం తొలగించాం. వర్షాలకు తుప్పలు మళ్లీ పెరిగాయి. త్వరలో ఆస్పత్రి ఆవరణను శుభ్రం చేయిస్తాం.

– హేమరాజు, వైద్యాధికారి, కానూరు పీహెచ్‌సీ

న్యూలైఫ్ హాస్టల్లో ప్రత్యేక వైద్యశిబిరం



దూబచర్ల న్యూలైఫ్ స్కూలు హాస్టల్ విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టరు గంగాధరరావు

నల్లజర్ల: దూబచర్ల గాంధీ కాలనీలోని న్యూలైఫ్ స్కూల్ హాస్టల్ విద్యార్థులకు అస్వస్థత అంశంపై ఆదివారం సాక్షిలో వెలువడిన కథనంపై జిల్లా వైద్యారోగ్యశాఖ స్పందించింది. డీఎంహెచ్‌ఓ కె.వెంకటేశ్వరావు ఆదేశాల మేరకు స్థానిక పీహెచ్‌సీ డాక్టరు గంగాధరరావు హాస్టల్లో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి వారికున్న రుగ్మతలను గుర్తించి వాటి నివారణకు మందులు అందజేశారు. ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శారీరక, పరిసరాల శుభ్రత పాటించడం ద్వారా రుగ్మతలను నివారించవచ్చని విద్యార్థులకు తెలియజేశారు. హాస్టల్ ఆవరణ అంతా క్లోరినేషన్ చేయించారు. ఒకే ప్రాంతంలో సామూహికంగా స్నానాలు చేయడం, ఒకే చోట పడుకోవడం, ఒకే సబ్బు వినియోగించడం, వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా ఈవిధమైన రుగ్మతలు చోటు చేసుకుంటాయని డాక్టరు వివరించారు. విద్యార్థులందరికీ స్వస్థత చేకూరే వరకు మూడు రోజుల పాటు వైద్య శిబిరం కొనసాగుతుందని డాక్టరు గంగాధరరావు తెలిపారు.142 మంది విద్యార్థులు ఆరోగ్య పరీక్షలు చేసినట్టు చెప్పారు. సూపర్‌వైజర్ జీవీవీ ప్రసాద్, కరస్పాండెంట్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా పడి పూజ



పెరవలిలో వినాయకుడి గుడి వద్ద పడి పూజ

పెరవలి: స్వామియే శరణం అయ్యప్ప అంటూ శరణుఘోషతో పెరవలి పులకరించింది. స్వామి మాల ధరించిన 400 మంది అయ్యప్ప స్వాములతో శనివారం రాత్రి నిర్వహించిన పడి పూజ చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. పెరవలి గ్రామానికి చెందిన జక్కల భైరవమూర్తి, జక్కల సాయి, అల్లాడి కుమారస్వామి ఆధ్వర్యంలో ఈ పడి పూజ ఘనంగా నిర్వహించారు. ఈ పడి పూజకు అజ్జరం, వెంకట్రాయపురం, కాకరపర్రు, తీపర్రు, కాపవరం, నల్లాకులవారిపాలెం, కొత్తపల్లి అగ్రహారం, ముక్కామల, ఖండవల్లి గ్రామాలకు చెందిన అయ్యప్ప మాల ధారులు హాజరయ్యారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే లక్ష్యం



పాలంగిలో దాత వాకలపూడి గణేశ్వరరావును సత్కరిస్తున్న మండల మానవత సభ్యులు

ఉండ్రాజవరం: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే మానవత లక్ష్యమని మండల మానవత అధ్యక్షుడు కఠారి సిద్ధార్థరాజు అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల నెలవారీ సమావేశం పాలంగిలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో తాడిపర్రు గ్రామానికి చెందిన దాత వాకలపూడి గణేశ్వరరావు పాల్గొని శాంతి రథం నిమిత్తం రూ.10 వేలు విరాళాన్ని సభ్యులకు అందజేశారు. మానవత మండల చైర్మన్ తాతిన కృష్ణారావు మానవత అందిస్తున్న సేవలను వివరించారు. అనంతరం కాల్ధారి గ్రామానికి చెందిన గారపాటి నవ్య విద్యాభ్యాసం నిమిత్తం రూ.5 వేలు, రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వేలివెన్నుకి చెందిన దండమూరి రవీంద్రకు రూ. 5 వేలు, అనారోగ్యంతో బాధపడుతున్న తాడిపర్రుకు చెందిన గ్రంధి పృథ్వీరాజుకు రూ.5 వేలు, బిల్డింగ్‌పై నుంచి పడి తీవ్రగాయాలపాలైన కార్మికుడు మోటుపల్లి ఆనంద్ మనోహర్ వైద్య ఖర్చుల నిమిత్తం సంస్థ రూ.5వేలు, దాత పణితిన పార్వతి రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీ.సతీష్ బాబు, వెలిచేటి బోస్, సుంకవల్లి వెంకటేశ్వరావు, కొడూరి ప్రసాద్, కొడూరి శ్రీనివాసు పాల్గొన్నారు.

గుబ్బాలమ్మ ఆలయం వద్ద అన్నసమారాధన

నిడదవోలు రూరల్: దేవీ నవరాత్రి ఉత్సవాల ముగింపులో భాగంగా మండలంలోని గోపవరం గుబ్బాలమ్మవారి ఆలయం వద్ద ఆదివారం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి గుబ్బాలమ్మను దర్శించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆరేపల్లి భాగ్యలక్ష్మి, నాయకులు పంచదార దుర్గాప్రసాద్, ఆరేపల్లి చినసంగాలు, ఆలయ మేనేజర్ నామా సూర్యప్రకాశరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశాజనంగా ఖరీఫ్ వరి పంట

- వడి వడిగా వరి కోతలు
- 449 హెక్టార్లలో కోతలు పూర్తి
- నాలుగు మండలాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం
- ఎకరాకి సరాసరి 40 బస్తాల దిగుబడి

కొవ్వూరు: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి పంట ఆశాజనకంగా పండింది. మొదట్లో రైతులు ప్రతికూల వాతావరణంతో కాస్త ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎకరాకి 35 నుంచి 42 బస్తాలు వరకు దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సరాసరి 40 బస్తాల దిగుబడి లభించనున్నట్లు చెబుతున్నారు. ఖరీఫ్ వరి కోతలు వడివడిగా ప్రారంభమయ్యాయి. డివిజన్‌లో నల్లజర్ల మండలంలో ఇప్పటికే 6.3 శాతం వరి కోతలు పూర్తి చేశారు. జిల్లాలోనే గరిష్టంగా నల్లజర్లలో 217 హెక్టార్లలో ఇంత వరకు వరి కోతలు పూర్తి చేశారు. డివిజన్‌లో 39,620 హెక్టార్లలో సాధారణ సాగు విస్తీర్ణం ఉంటే దీనిలో 37,144 హెక్టార్లలో వరి నాట్లు వేశారు. దీనిలో ఇప్పటి వరకు 449 హెక్టార్లలో వరి కోతలు పూర్తయ్యాయి. పెరవలిలో 60, కొవ్వూరులో 52, నిడదవోలులో 51, గోపాలపురంలో 28, దేవరపల్లిలో 12, చాగల్లులో 18, తాళ్లపూడిలో 11 హెక్టార్లలో వరి కోతలు పూర్తి చేశారు. ఉండ్రాజవరం మండలం మినహా డివిజన్‌లో అన్ని మండలాల్లోనూ వరి మాసూళ్లు ప్రారంభించారు.



నల్లజర్ల మండలంలో వరి పంట కోస్తున్న యంత్రం

మూడు మండలాల్లో కొనుగోళ్ల ప్రారంభం

డివిజన్ పరిధిలో ప్రస్తుతం నాలుగు మండలాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమ య్యాయి. రాష్ట్రంలోనే తొలిసారిగా కాపవరంలో ధాన్యం కొలుకోలు కేంద్రం ప్రారంభం కాగా, నల్లజర్ల, చాగల్లు మండలాల్లోనూ కొనుగోళ్లు నడుస్తున్నాయి. కొవ్వూరు మండలంలో 325.56 మెట్రిక్ టన్నులు, చాగల్లులో 228.04, దేవరపల్లిలో 9.4, నల్లజర్లలో 1.64 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేశారు. డివిజన్‌లో ఇంత వరకు 564.28 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు అధికారులు తెలిపారు. డివిజన్‌లో అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన గోనె సంచెలు సిద్ధంగా ఉన్నాయని పౌరసరఫరా శాఖ డీఎం రాధిక తెలిపారు.


గోనె సంచెలు సిద్ధం చేశాం



ఈ ఖరీఫ్ వరి సాగు ఆశాజనకంగా ఉంది. ఎకరాకి సరాసరి 35 నుంచి 42 బస్తాల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నాం. డివిజన్ పరిధిలో 126 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. వీటిలో నాలుగు మండలాల్లోనే కొనుగోళ్లు ప్రారంభించారు. ఈ నాలుగు మండలాల్లో సుమారు పది కేంద్రాల్లో కొనుగోలు బాగా సాగుతున్నాయి.వరి కోతలు ప్రారంభించిన కేంద్రంలో అవసరమైన గోనె సంచెలు సిద్ధంగా ఉన్నాయి. డిసెంబర్ 15వ తేదీ నాటికి వరి కోతలు నూరు శాతం పూర్తయ్యే అవకాశం ఉంది.

–సీహెచ్ చంద్రశేఖర్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, కొవ్వూరు

కోటసత్తెమ్మకు ప్రత్యేక పుష్పాలంకరణ



ప్రత్యేక అలంకరణలో కోటసత్తెమ్మ అమ్మవారు

నిడదవోలు రూరల్: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ పర్యవేక్షణలో కోటసత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టికెట్లు, ఫొటోల అమ్మకంతో రూ.1,41,251 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బెంబేలెత్తిస్తున్న కూరగాయల ధరలు

- మూడు నెలలుగా దిగిరాని ధరలు
- కిలో కూరగాయల ధర రూ. 100 నుంచి 120
- మండుతున్న వంట నూనెల ధరలు
- విలవిల్లాడుతున్న సామాన్య ప్రజలు

దేవరపల్లి: మార్కెట్లో కూరగాయల ధరలు అందుబాటులో లేక ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. కాయకూరలు కొనాలంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. నలుగురు సభ్యులు గల కుటుంబం వారానికి సరిపడా కూరగాయలు కొనాలంటే కనీసం రూ.800 ఖర్చు అవుతుందని ప్రజలు వాపోతున్నారు. అన్ని రకాల కూరగాయలు కిలో రూ. 100 నుంచి 120 పలుకుతున్నాయి. మూడు నెలలుగా మార్కెట్లో ఇదే పరిస్థితి ఉంది. కిలో వంకాయలు రూ. 120, నలుపు రంగు కాయలు రూ. 80, బీరకాయలు కిలో రూ. 60, టమోటా రూ. 50, కాకర కాయలు రూ. 40, అరటి కాయ రూ. 12, బెండకాయలు రూ. 80, దొండకాయలు రూ. 50, బంగాళాదుంపలు రూ. 60, దోస కాయ కిలో రూ. 60, క్యారెట్లు రూ. 50, ఉల్లిపాయలు కిలో రూ. 60, పచ్చిమిర్చి కిలో రూ. 60, ఆగాకర కాయలు కిలో రూ. 200, చిక్కుళ్లు రూ.160, ధర పలుకుతున్నాయి. కూరగాయల ధరలు ఈ విధంగా ఉంటే ఏలా కొనాలి, ఏమి తినాలంటూ ప్రజలు వాపోతున్నారు. వీటితో పాటు వంట నూనెల ధరపై అధికారుల నియంత్రణ లేకపోవడంతో రోజురోజుకూ పెరుగుతున్నాయి. పామాయిల్ లీటరు ధర రూ. 122, వేరుశనగ 128, సన్‌ఫ్లవర్ రూ. 135 ధర పలుకుతున్నాయి. ఇప్పుడే ధరలు ఈ విధంగా ఉంటే మరొక వారం రోజుల్లో కార్తీక మాసం ప్రారంభం కాబోతున్నందున ధరలు ఏవిధంగా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కూరగాయలు, ఆకుకూరల ధరలు రైతు వద్ద కంటే వ్యాపారుల వద్ద 50 శాతం అదనంగా ధర పలుకుతున్నట్టు ప్రజలు తెలిపారు. పండుగలు వస్తున్న వేళ మార్కెట్లో ధరల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఉపాధ్యాయుడికి ఘన సత్కారం

కొవ్వూరు: పట్టణంలో అచ్చాయమ్మ కాలనీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఈనెలాఖరున పదవీ విరమణ చేస్తున్న టి.జాన్‌బాబు రత్నం దంపతులను ఆదివారం ఘనంగా సత్కరించారు.మాజీ మంత్రి కేఎస్ జవహర్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు, రూరల్ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే సలీం, ఎస్‌కే జానీ, ఇతర ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.ఏపీటీఎఫ్ తరుపున పదవీ విరమణ చేసిన జాన్‌బాబు రత్నంకి రూ.10వేలు నగదు అందజేశారు.

కళ్లు తెరిస్తే దుమ్ము.. కళ్లు మూస్తే ప్రమాదం



తీపర్రు వద్ద నిడదవోలు-నరసాపురం ఆర్‌అండ్‌బీ రహదారిలో వాహనం వెళుతున్నప్పుడు లేచిన దుమ్ము

నిడదవోలు-నరసాపురం ఆర్‌అండ్‌బీ రహదారిపై ప్రయాణం వాహనచోదులకు ప్రాణ సంకటంగా మారింది. కళ్లు తెరిచి వెళుతుంటే వాహనాలు వచ్చినప్పుడు లేచిన దుమ్ముకి రోడ్డు కనించని పరిస్థితి. కంట్లో దుమ్ము, ధూళి పడి ప్రయాణికులు, వాహనదారులు నానా అగచాట్లు పడుతున్నారు. అదే సమయంలో కళ్లు మూస్తే గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు. ఈ రహదారిలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పెరవలి నుంచి కానూరు 8 కిలోమీటర్ల దూరం ప్రయాణానికి గంట సమయం పడుతోందని, వర్షం కురిస్తే అవస్థలు రెట్టింపు అవుతున్నాయని వాహనదారులు అంటున్నారు. కనీసం ఈ రోడ్డుపై గోతులనైనా పూడ్చాలని వాహనదారులు వేడుకుంటున్నారు.

– పెరవలి

న్యూటన్ పాండుకు జాతీయ పురస్కారం



విప్పర్తి ఐజక్ న్యూటన్ పాండుకు పాన్ ఇండియా జాతీయ పురస్కారాన్ని అందజేస్తున్న మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు

నిడదవోలు రూరల్: తాడిమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు డాక్టర్ విప్పర్తి ఐజక్ న్యూటన్‌పాండు పాన్ ఇండియన్ జాతీయ పురస్కారాన్ని అందుకున్నట్లు ఆదివారం ఆయన తెలిపారు. పాన్ ఇండియన్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యానంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్య, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా సేవలందిస్తున్న న్యూటన్‌పాండుకు పుదుచ్చేరి ప్రభుత్వ అధికార ప్రతినిధి, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు చేతులు మీదుగా జాతీయ పురస్కారం అందుకున్నారు.న్యూటన్‌పాండును సంస్థ అధ్యక్షుడు అద్దంకి రాజా, ప్రధాన కార్యదర్శి ఏబీ ప్రసూన, ప్రముఖ కవి డాక్టర్ గూటం స్వామి, ఉపాధ్యాయులు అభినందించారు.